క్లుప్తంగా

గ్రామాల్లో చిన్నారుల సందడి



విచిత్ర వేషధారణలో చిన్నారులు

డుంబ్రిగుడ: మన్యంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని కించుమండ వారపు సంతలో బుడియా వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ప్రతి దుకాణం నుంచి డబ్బులు, బియ్యం, కూరగాయలు సేకరించారు. బుడియాలు వసూలు చేసిన నగదు, నిత్యావసరాలతో గ్రామస్తులందరూ కలిసి వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ.

అనంతగిరి: మండలంలోని డముకు వారపు సంతలోని బుడియాలు సందడి చేశారు. యువకులు వివిధ వేషధారణలోని నృత్యాలు చేసుకుంటూ దుకాణాలు వద్దకు వెళ్లి పండగ మామూళ్లు అడిగారు. థింసా నృత్యాలతో హోరెత్తించారు.

ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తి చేయాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ఉపాధి పథకం పనుల లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి జాబ్‌కార్డుకూ ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని, వంద రోజుల పని కల్పించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శాలకు అనుగుణంగా పనులు చేయించాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ పాపారావు, ఉపాధి పథకం ఏపీఓ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా గిరిజన సంఘం, గిరిజన కళాకారుల సంఘం, గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు కంచాలు, పెన్నులు, నోట్ పుస్తకాలు తదితర బహుమతులు అందజేశారు. నాయకులు బుజ్జిబాబు, జోషి, శశికళ, రాధ, లక్ష్మీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ బీఎంగా కొండబాబు



జి.మాడుగుల: గిరిజన ప్రైమరీ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీసీసీ ఎంఎస్ –జీసీసీ) బ్రాంచి మేనేజర్‌గా నందోలి కొండబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన బీఎం కొండన్న జీకె వీధి బ్రాంచికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ కొండబాబు మాట్లాడుతూ జీసీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది సహకారంతో కాఫీ కొనుగోళ్ల లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జీసీసీ బ్రాంచీల ద్వారా సకాలంలో బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

20, 21 తేదీల్లో పెదవలసలో 'గడప గడపకు'

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస సచివాలయం పరిధిలో 20 నుంచి 21 వరకు రెండు రోజులపాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారని, పార్టీ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గిరిజనుల అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యం



గిరిజనులకు ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



భీసుపురంలోని గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి

- పాడేరు, అనంతగిరిలలో 'గడప గడపకు' విశేష ప్రజాదరణ
- సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: గిరిజనుల సంపూర్ణ అభివృద్ధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మారుమూల ఐనాడ పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. చీకుపనస, రాకోట, కూసర్లపాలెం, ఆరుగురు, గుల్లి, పోతంపాలెం, పూలగరువు, కొండజీలుగులు, గదబవలస, అయినాడ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించారు. ప్రతి ఇంటా ఎమ్మెల్యేకు గిరిజనులంతా పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 456 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల అమలుతీరు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిల నాయకత్వంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సమయం కావడంతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గిరిజనులతో కలిసి థింసా నృత్యాలతో సందడి చేశారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షపాతిగా నిలుస్తున్నారని, గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. శివారు గ్రామాల్లో సైతం తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. మన్యంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. అనంతరం రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, సర్పంచ్‌లు బి.భీమాలమ్మ, వి.బసవన్నదొర, జి.అప్పలకొండ, కె.కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు టి. ఎర్రయమ్మ, డి.మీనా, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, మాజీ సర్పంచ్‌లు కన్నాపాత్రుడు.దశమూర్తి, నాయకులు దేముడు, అర్జున్‌దొర, దేముడమ్మ, రామరాజు, గంగరాజు, ఈశ్వరరావు, రాజారావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మేలును గిరిజనులు మరచిపోరు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి:ప్రభుత్వం చేస్తున్న మేలును గిరిజనులు మరచిపోయే పరిస్థితి లేదని, గిరిజన మారుమూల గ్రామాల్లో సైతం అర్హత గత ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ భీసుపురం, పోర్నపోదొర్, సరసపోదొర్, కమలపురం జామిగుడ, ఘాటుగుడ, దిగువశోభ, ఎగువశోభ, పూలుగుడ గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఆయనకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 332 గడపలను ఎమ్మెల్యే సందర్శించి, గిరిజనులను అప్యాయంగా పలకరిస్తూ మూడేళ్ల పాలనలోని అమలైన సంక్షేమ పథకాలు అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు గిరిజనులు తమకు అందిన లబ్ధిపై ఆనందంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు.గడప గడప నిధులతో వెనువెంటనే సమస్యలను గుర్తించి, పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమం, అభ్యున్నతికి గిరిజనులు వైఎస్సార్‌సీపీకి రుణపడి ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి చెబుతారన్నారు. అందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు.ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్ సింహాద్రి, ఎంపీడీవో శ్రీహర్షిత్, కార్యదర్శులు రామస్వామి, రమేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సేవలు

- బ్యాంకు సేవలకు అంతరాయం

కొయ్యూరు: బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోవడంతో బ్యాంకు, తపాల శాఖల సేవలకు తీరని అంతరాయం ఏర్పడుతుంది. బుధవారం ఉదయం నుంచి నిలిచిపోవడంతో తపాల, బ్యాంకు సేవలు నిలిచాయి. ఖాతాదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని ఈ నెల ప్రారంభం నుంచి బీఎస్ఎన్ఎల్ సేవలు ఆశించిన రీతిలో లేవు. ఈ కారణంగా అనేక కార్యాలయాలకు అత్యవసర పనులు చేయడానికి సైతం నెట్ సౌకర్యం లేక ఇబ్బందులు తప్పలేదు. 516/ఈ జాతీయ రహదారి పనుల్లో భాగంగా రోడ్డును తవ్వడంతో కేబుల్ తెగిపోయింది. రోజుల తరబడి ఉన్న సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గంగవరం: బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ తరచూ మొరాయిస్తుండడంతో సెల్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.వారం రోజులుగా గంగవరం, కొత్తాడ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ టవర్లు సాంకేతిక ఇబ్బందులు కారణంగా పనిచేయక పోవడంతో వినియోగదారుల సెల్‌ఫోన్లు మూగబోయాయి. గంగవరం, కొత్తాడ సెల్ టవర్లు పరిధిలో గిరిజన గ్రామాల్లో సెల్ ఫోన్లు పనిచేయకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. సెల్ నెట్‌వర్కుతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో , మీ–సేవా కేంద్రాల్లో, గ్రామ సచివాలయాల్లో నెట్‌వర్క్ ఇబ్బందులు కారణంగా ఆన్‌లైన్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల విస్తరణ పనులు కారణంగా సెల్ నెట్‌వర్క్ కేబుళ్లు చెడిపోవడంతో ఈ ఇబ్బంది ఎదురైనట్టు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారం కానుంది.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం

రాంబిల్లి: మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనంతో తీర్థం సందడిగా మారింది. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. వయస్సును పక్కనబెట్టి మరీ రంగుల రాట్నాలు ఎక్కి జనం ముచ్చట పడ్డారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మామిడివాడ తీర్థంలో జనసందోహం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో బుధవారం తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. వివాదాలు జరగకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జనుము పంటపై రైతుల ఆసక్తి

రోలుగుంట: మండలంలో జనుము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో 920 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జనుము పంట సాగు చేస్తున్నారు. ఈ పంటకు వర్షంతో పెద్దగా పని లేదు. ఖరీఫ్‌లో సాగయిన వరి పంట పొలాల్లో కోతలకు ఒక ట్రెండు రోజులు ముందుగా వీటిని వేస్తారు. ఎకరానికి నాలుగు కేజీల జనుము విత్తనాలు సరిపోతాయి. ఈ పంట మంచు తేమకే బాగా పెరుగుతుంది. కూలీలతో ప్రయాస లేదు. దుక్కులు దున్నే అవసరమూ లేదు. కేవలం మూడు నెలల్లోపే పంట చేతికి వస్తుంది. పంట పండితే దిగుబడి కూడా బాగానే ఉంది. పెట్టుబడి విత్తనాల కొనుగోలుకు కిలోకి రూ.75 చొప్పున నాలుగు కిలోలకు రూ.300 మాత్రమే. పంట సేకరణకు తప్ప, మరే పెట్టుబడి వ్యయం ఉండదు. దిగుబడి ఎకరానికి కనీసం రూ.10 వేలు వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. దీంతో పెద్దగా ఖర్చులేని వ్యవసాయం కావడంతో రైతులు ఖరీఫ్ సీజన్లో జనుము పంటపై ఆసక్తి చూపుతున్నట్టు వ్యవసాయాధికారులు చెప్తున్నారు.



రోలుగుంటలో కళకళలాడుతున్న జనుము పంట

రథసప్తమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లిటౌన్ : విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి కొండపై ఈనెల 28 నిర్వహించే రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను స్వగృహంలో బుధవారం ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సప్తమి వేడుకల పోస్టర్‌ను మంత్రి అమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన ఆదేశించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ బొడ్డగొంది గ్రామంలో కిలగాడ వైద్యాధికారి డాక్టర్ శిరీషా ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 60 కుటుంబాలకు వైద్య సేవలందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఎంపీహెచ్ఎస్‌లు కృష్ణవేణి, ఉషారాణి, ఎంపీహెచ్ఏ ఈశ్వరమ్మ, డీఈవో వేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు



సీఐ రమేష్

చింతపల్లిరూరల్: గిరిజనులు జూదాలకు దూరంగా ఉండాలని సీఐ రమేష్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో జరగనున్న అమ్మవారి ఉత్సవాలు ఇతరత్రా వేడుకలు, జాతర్ల నేపథ్యంలో కోడి పందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో తీర్థాలు

కశింకోట: మండలంలోని పాత కన్నూరుపాలెంలో బుధవారం సాయంత్రం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆట వస్తువులు, తిను బండారాలు అమ్మకాలు జోరుగా సాగాయి. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అలాగే జమాదులపాలెం గ్రామంలో తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో బుధవారం రాత్రి బొర్రమాంబ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఉత్సవంలో పాల్గొని అమ్మ వారిని దర్శించారు.

వేడుకగా ముగ్గుల పోటీలు



పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో గ్రామాల వారిగా తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పేటసూదిపురం గ్రామంలో తీర్థం నిర్వహించారు. పరిసర ప్రాంతాల వారు అంతా ఈ గ్రామానికి చేరుకుని యువత, ఆటవస్తువులు ఉపయోగించుని, తినుబండారాలు ఆరగిస్తూ సందడి చేశారు. గ్రామంలో తీర్ధ మహోత్సవం పురస్కరించుకుని సర్పంచ్ కర్ణం మేఘమాల భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్ణం శివ సమక్షంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ విజేతలకు బహుమతలకు అందజేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పందెం



ఎడ్ల పరుగు పందెంను తిలకిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో బుధవారం లక్ష్మీకాంతమ్మ చిట్టెమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందెం పోటీలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ఎడ్లను హుషారుగా రంకెలేయిస్తూ రైతులు పరుగులు తీయించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల పరుగు పందెం పోటీలతో పాటు ముగ్గుల పోటీలు, ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందించారు.

గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు



థింసా నృత్యం చేస్తున్న గ్రామస్తులు

హుకుంపేట: మండలంలోని 33 పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామల్లో సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. కొత్త పంటలతో ప్రత్యేక వంటకం చేసి పశువులకు పులగం తినిపించారు. అనంతరం గ్రామల్లో థింసా నృత్యాలతో సందడి చేశారు. మండలంలోని కొంతిలి గ్రామంలో సర్పంచ్ రేగం రమేష్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.



కొంతిలో ముగ్గుల పోటీలు

జెడ్పీ సమావేశంలో సమస్యలపై చర్చ



కాకినాడలో జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న రాజవొమ్మంగి జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి



కాకినాడలో జిల్లా పరిషత్ చైర్మన్ గోపాలకృష్ణను కలిసిన వై.రామవరం ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నుంచి మైదానప్రాంతం అయిన ఏలేశ్వరం వరకు గల ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతు చేపట్టాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి కోరారు. కాకినాడలో బుధవారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలానికి చెందిన పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఆమె మాట్లాడుతూ రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వెళ్లే రహదారి కొంతమేర (13 కిలోమీటర్లు) పెద్ద పెద్ద గోతులున్నాయని, దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగేళ్లు కావస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జడ్డంగి, రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీలలో మందులు కొరత ఉన్నట్టు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు భవన పనులు పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య ఉందని అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

రహదారుల సమస్యలపై వినతి

వై.రామవరం: మండలంలోని పలురోడ్ల నిర్మాణాల సమస్యలపై బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ గోపాలకృష్ణకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి విన్నవించారు. కాకినాడ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన వారు చైర్మన్‌ను కలిశారు. ఈ మేరకు వై.రామవరం నుంచి గురమంద, మఠంభీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు, దారగడ్డ నుంచి దుంపవలస మీదుగా పోలమానుగొంది, సిరిమెట్ల గ్రామం నుంచి వలస, చీడిమానువీధి నుంచి దారలోవ, తదితర ప్రాంతాల్లో అటవీశాఖ అడ్డంకులతో రోడ్డు పనులు నిలిచిపోయాయని విన్నవించారు. ఆయా ప్రాంతాలకు నాడు–నేడు నిధులు మంజూరైనా, మెటీరియల్ రవాణా చేయడానికి ఇబ్బందికరంగా ఉన్నట్టు తెలిపారు. ఆయా రోడ్ల నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేయాలని వారు కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చైర్మన్ గోపాలకృష్ణ సానుకూలంగా స్పందించి, రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీపీ కడబాల ఆనందరావు తెలియజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/కొయ్యూరు/అడ్డతీగల/రాజవొమ్మంగి/చింతూరు/గంగవరం: దివంగత ఎన్.టి.రామారావు వర్ధంతిని జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కొయ్యూరులో టీడీపీ నాయకులు పేదలకు చీరలు పంపిణీ చేశారు. డుంబ్రిగుడ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పాలు అందజేశారు. టీడీపీ నాయకులు శ్రావణ్‌కుమార్, సుబ్బారావు, స్వామి, చిరంజీవి, చక్రరావు, రమణారెడ్డి, రాజేశ్వరి, చిన్నారెడ్డి, అర్జున తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గౌరీపరమేశ్వరులకు ఘనంగా సారె

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో నిలిపిన శ్రీ గౌరీపర్వమేశ్వరి ఉత్సవమూర్తులకు బుధవారం సారె సమర్పించారు. గ్రామంలో ప్రతి ఏడాది కార్తీక మాసం మొదలు కొని మూడు నెలలు పాటు స్వామికి ప్రత్యేక పూజలు అందిస్తూ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా భక్తులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి గవర కార్పొరేషన్ డైరక్టర్ కొణతాల ఉమాదేవి, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సారె సమర్పించారు.



సారె తీసుకువస్తున్న భక్తులు

నేడు ఐనాడలో 'గడప గడపకు'

పాడేరురూరల్: మండలంలోని ఐనాడ సచివాలయం పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పంచాయతీలోని గడ్డిబందలు, నేరేళ్లు, గునగుమ్మి, తొలుగురు, గిన్నెగరువు, జంగిడపల్లి, పెద్దపాలం, కొండంగిపుట్టు తదితర గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇంటింటా పర్యటించి, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న పెద్దలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

ఘనంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం

నాతవరం: మండల కేంద్రంలో శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం మేరకు గత నెల రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా మహిళలు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన వంటకాలతో సారె పెట్టారు. వాహనంపై గౌరీ పరమేశ్వరులను పురవీధుల్ల ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఎం.బి.పట్నంలో కూడా గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి, మహిళలు సారెతో సాగనంపారు.